# నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం

- నర్సంపేటలో 24 గంటలు వైద్య సేవలు అందేలా కృషి
- డాక్టర్లు ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి
- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దొంతి, ఆర్డీవో, వైద్యాధికారులు

నర్సంపేట, డిసెంబర్ 13: రాష్ట్రంలో ప్రజలం దరికీ నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో పరిమితిని రూ. 10 లక్షలకు పెంచిన సందర్భంగా ప్రచార వాల్ పోస్టర్లను బుధవారం ఎమ్మెల్యే చేతులమీదుగా జిల్లా ఆస్పత్రిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా దొంతి మాట్లాడుతూ రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పేదల పాలిట వరంగా మారిందన్నారు. దవాఖానలో అనుభవజ్ఞులైన వైద్యులతో పేదలకు 24 గంటలపాటు వైద్య సేవలు అందిస్తామన్నారు. సమస్యలుంటే అధికారులు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాజీవ్ ఆరోగ్యశ్రీలో 126 రకాల చికిత్సలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అవి కాకుండా రూ. పది లక్షలకు పైగా ఖర్చు అయితే వాటిని సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరుకు కృషి చేస్తానని చెప్పారు. ఆస్పత్రిలో సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించేలా చూస్తానన్నారు. అధికారులు కూడా నిత్యం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నర్సంపేట ఆర్డీవో కృష్ణవేణి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ మనోజలాల్, కౌన్సిలర్లు రుద్ర మల్లీశ్వరి, వేముల సాంబయ్యగౌడ్, బత్తిని రాజేందర్, ఒర్సు అంజలి పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేను కలిసిన వీవోఏలు

చెన్నారావుపేట: ఎమ్మెల్యే మాధవరెడ్డిని మండలంలోని వీవోఏలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వీవోఏలకు కనీస వేతనం రూ. 20 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ. 10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో వీవోఏల సంఘం మండల గౌరవాధ్యక్షుడు బోళ్ల ఐలయ్య, మండల అధ్యక్షురాలు ఎండీ అస్మా, కార్యదర్శి ఆరెల్లి శ్యామ్‌సుందర్, కోశాధికారి తుమ్మ జ్యోతి, సహాయ కార్యదర్శి అరిగెల కుమారస్వామి, ఉపాధ్యక్షులు జ్యోతి, ఆమని కోమల, అనిత, స్వరూప, అశ్విని, లత, పర్వీన్, రమ, మంజుల, సభ్యులు పాల్గొన్నారు.

# దాడి ఘటనలో గాయపడిన యువకుడి మృతి

## వరంగల్ ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన బాధితుడు


రాకేశ్(ఫైల్)

వరంగల్ చౌరస్తా, డిసెంబర్ 13: అర్ధరాత్రి యువకుడిపై దాడి చేసి నగదు, బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. దారి దోపిడీకి పాల్పడిన వ్యక్తుల చేతిలో తీవ్రంగా గాయపడి ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతున్న యువకుడు మంగళవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల కథనం ప్రకారం.. కాశీబుగ్గ శాంతి నగర్‌కు చెందిన ఏకెళ్లి రాకేశ్(23) తండ్రి చనిపోవడంతో క్యాటరింగ్ సర్వీస్ పనులు చేసుకుంటూ తల్లితో కలిసి జీవనం సాగిస్తున్నాడు. విధుల్లో భాగంగా ఈ నెల 4న రాత్రి ఒంటిగంట సమయంలో హనుమకొండలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పని పూర్తి ముగించుకొని తనతోపాటు క్యాటరింగ్ సర్వీస్ పనులకు వచ్చిన మహిళతో కలిసి వరంగల్ బస్టాండ్‌కు చేరుకున్నాడు. బస్టాండ్ నుంచి చాంబర్ ఆఫ్ కామర్స్ భవనం ముందు నుంచి కాశీబుగ్గ సెంటర్‌కు వెళ్తున్న వీరిని ముగ్గురు యువకులు అడ్డుకొని సదరు మహిళను బెదిరించి పంపించారు. తన వద్ద ఉన్న నగదు, బంగారు ఆభరణాలు (చైన్, ఉంగరాలు) ఇవ్వాలని రాకేశ్‌ను బెదిరించారు. అతడు అంగీకరించకపోవడంతో రాకేశ్‌పై బండరాయితో దాడి చేశారు. తలకు తీవ్ర గాయం కావడంతో అపస్మారక స్థితిలో ఉన్న రాకేశ్ నుంచి నగదు, బంగారు ఆభరణాలు తీసుకొని దుండగులు పారిపోయారు. రక్తపు మడుగులో పడి ఉన్న రాకేశ్‌ను స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి 108 వాహనంలో ఎంజీఎం దవాఖానకు తరలించి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. చికిత్స పొందుతూ రాకేశ్ మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. బుధవారం ఉదయం ఇంతేజార్‌గంజ్ పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీసీ పుటేజీల ఆధారంగా విచారణ జరుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

### పెట్రోలింగ్ లేకపోవడమే కారణం..

నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే వరంగల్ బస్టాండ్, రైల్వేస్టేషన్ల జంక్షన్‌లో నిరంతరం పోలీసుల పర్యవేక్షణ అవసరమని, సరైన పెట్రోలింగ్ నిర్వహించకపోవడం వల్లే ఇలాంటి దారి దోపిడీ ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో సైతం కూరగాయల మార్కెట్‌కు వచ్చిన రైతులు, దూరప్రాంతాల నుంచి ప్రయాణాలు చేసి వస్తున్న వారిపై దాడులు జరిగిన సందర్భాలూ చాలానే ఉన్నాయని చెబుతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# 'కాంగ్రెస్ ఎంపీ అక్రమ సంపాదనపై స్పందించాలి'


నిరసన తెలుపుతున్న విజయచందర్‌రెడ్డి, నాయకులు

గీసుగొండ, డిసెంబర్ 13: రాహుల్‌గాంధీ స్నేహితుడు, కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహు ఇంట్లో లభ్యమైన నల్లధనంపై కాంగ్రెస్ పార్టీ స్పందించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెసరు విజయచందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండలకేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సంపదను అక్రమంగా దోచుకునే కాంగ్రెస్ ప్రజలకు ఏం న్యాయం చేస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎంపీ అక్రమ సంపాదనపై రాహుల్‌గాంధీ స్పందించాలని కోరారు. ధీరజ్ సాహు దేశ ప్రజల సొమ్మును అక్రమంగా దోచుకున్నాడని, నల్లధనంలో ఎవరెవరికి వాటాలు ఉన్నాయో ప్రజలకు కాంగ్రెస్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నిరసనలో బీజేపీ మండలాధ్యక్షుడు జానీ విక్రం, నాయకులు రవికుమార్, బాలరాజు, రమేశ్, రాజిరెడ్డి, రాజేందర్, రోశయ్య, భిక్షపతి, నాగరాజు, సందీప్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్‌కు మెమో

ఆత్మకూరు, డిసెంబర్ 13: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ-5 సెంటర్ టీచర్ పద్మకు సీడీపీవో భాగ్యలక్ష్మి బుధవారం మెమో జారీ చేశారు. టీచర్ పద్మ, ఆయాకు గొడవల కారణంగా ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డితో కలిసి విచారణ చేపట్టారు. టీచర్ నిర్లక్ష్యం కారణంగా సెంటర్ నిర్వహణ సరిగా లేదని గుర్తించి మెమో జారీ చేశారు.

# నాగుర్లపల్లిలో వేర్వేరు కారణాలతో ఇద్దరు మృతి

- ఒకేరోజు.. ఒకే వీధిలో మృత్యువాత
- గ్రామంలో 3 నెలల్లో 8 మంది మృతి!

నర్సంపేటరూరల్, డిసెంబర్ 13: ఒకేరోజు.. ఒకే వీధిలో వేర్వేరు కారణాలతో ఇద్దరు మృతి చెందిన ఘటన నాగుర్లపల్లిలో బుధవారం జరిగింది. గడిచిన మూడు నెలల్లో 8 మంది వివిధ కారణాలతో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తనుగుల సాంబయ్య (62) అనారోగ్యంతో, అయిత రాజు (46) గుండెపోటుతో బుధవారం ఉదయం మృతి చెందారు. వీరిద్దరూ ఒకే కాలనీకి చెందిన వారు. అయితే, మూడు నెలల్లో ఇదే గ్రామానికి చెందిన 8 మంది వివిధ కారణాలతో మృతి చెందారు. ఉన్నతాధికారులు, వైద్యులు తక్షణమే స్పందించి గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహించాలని నాయకులు బుర్రి సాగర్, తనుగుల శ్రీకాంత్, గొర్రె రాములు, మారపెల్లి రాజు, శ్రీరాము, మదాసి సరిత, బుర్రి సునీల్, చింటు, గ్రామస్తులు కోరారు.

### ఎస్సై అశోక్ బాధ్యతల స్వీకరణ

దామెర/చెన్నారావుపేట, డిసెంబర్ 13: ఎస్సై కె.అశోక్ బుధవారం పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ముత్యం రాజేందర్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా వీఆర్‌కు బదిలీ చేయగా, అతడి స్థానంలో అశోక్ బాధ్యతలు తీసుకున్నారు. చెన్నారావుపేట ఎస్సై శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. తోట మహేందర్ వీఆర్‌కు బదిలీ అయ్యారు.

### 'అక్కంపేటలో సర్వే నంబర్లు కలపొద్దు'

ఆత్మకూరు, డిసెంబర్ 13: ఇటీవల రెవెన్యూ గ్రామంగా మారిన అక్కంపేటలో పెద్దపురం శివారులోని పెద్దచెరువు, రామప్ప చెరువు, రామప్ప ఆలయాలకు సంబంధించిన సర్వే నంబర్లను కలపొద్దని అన్ని రాజకీయ పార్టీల నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ సురేశ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సావురే కమలా రాజేశ్వర్‌రావు, జడ్పీటీసీ కక్కెర్ల రాధిక రాజు, ఎంపీటీసీ కమలాపురం రమేశ్, బీఆర్ఎస్ నాయకుడు కుమారస్వామి పాల్గొన్నారు.

### మామపై అల్లుడి దాడి

ఖానాపురం, డిసెంబర్ 13: మామపై అల్లుడు దాడి చేసిన ఘటన అశోక్‌నగర్‌లో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వీరయ్య తన కుమార్తెను నర్సంపేటకు చెందిన అశోక్‌కు ఇచ్చి వివాహం జరిపించాడు. కొంతకాలంగా వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం సాయంత్రం మద్యం సేవించిన అశోక్.. అశోక్‌నగర్‌కు చేరుకుని అత్తమామలతో ఘర్షణ పడ్డాడు. మాటామంతి పెరగడంతో అశోక్ కత్తితో వీరయ్యపై దాడి చేశాడు. దీంతో వీరయ్య తల, చేతికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని నర్సంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అశోక్‌ను బుధవారం అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.

### వైభవంగా గౌరీనక్తం

పరకాల, డిసెంబర్ 13: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం వైభవంగా గౌరీనక్తం కార్యక్రమం నిర్వహించారు. అర్చకుడు ప్రదీప్‌శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీరాం రవీందర్, జయలక్ష్మి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

# సైలానీబాబా దర్గా అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యేలు


ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యేలు రేవూరి, నాగరాజు

దామెర, డిసెంబర్ 13: ఒగ్లాపూర్ సమీపంలోని సైలానీబాబా దర్గాను బుధవారం పరకాల, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్.నాగరాజు సందర్శించారు. ఈ సందర్భంగా దర్గాపీఠాధిపతి వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం దర్గాకు చాదర్ అందించి ఎమ్మెల్యేలు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. సైలానీబాబా దర్గాకు కులమతాలకతీతంగా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వచ్చి ప్రార్థనలు చేస్తున్నారని, భక్తుల కోరిన కోర్కెలు తీర్చే సైలానీబాబా దర్గా అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దొమ్మాటి సాంబయ్య, ఆత్మకూరు సర్పంచ్ రాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మన్నెం ప్రకాశ్‌రెడ్డి, పోలెపాక శ్రీనివాస్, దామెర శంకర్, కిన్నెర కోఠి, సదిరం పోశయ్య, ఉప సర్పంచ్ హింగె నాగేశ్వర్‌రావు, భిక్షపతి, దర్గా పెద్దలు రషీద్ సాహెబ్, ఎస్‌కె.మోయిన్, అమర్, కొమ్మాలు, అసద్ పాల్గొన్నారు.

# రక్త నమూనాల సేకరణను సమర్థవంతంగా నిర్వహించాలి


రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

నెక్కొండ, డిసెంబర్ 13: ఫైలేరియా(బోదకాలు) బాధితులను గుర్తించేందుకు చేపట్టిన రక్తపూత నమూనాల సేకరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని డబ్ల్యూహెచ్‌వో వరంగల్ కోఆర్డినేటర్ డాక్టర్ శిరీష అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు అలంకానిపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని తోపనపల్లిలో మంగళవారం రాత్రి చేపట్టిన ఫైలేరియా బాధితుల రక్తనమూనాల సేకరణను జోనల్ కో ఆర్డినేటర్ డాక్టర్ శిరీష ఆకస్మికంగా పర్యవేక్షించారు. రక్తనమూనాల సేకరణలో తీసుకున్న జాగ్రత్తలు, ఎలా సేకరిస్తున్నారో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శిరీష మాట్లాడుతూ బోదకాలు ఎంతో ప్రమాదకరమని, ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స పొందడం మేలు చేస్తుందన్నారు. రక్తనమూనాలు ఇచ్చేందుకు ఎలాంటి అనుమానాలకు గురికావొద్దని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఫకీర్‌మియా, నర్సంపేట సబ్‌యూనిట్ అధికారి నంద, సూపర్‌వైజర్ రాజు, సిబ్బంది ప్రభ, సుజాత, సురేందర్, లింగమూర్తి, ఆశ కార్యకర్తలు మాధవి, మమత పాల్గొన్నారు.

### అప్రెంటిస్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

గిర్మాజీపేట, డిసెంబర్ 13: మూడేళ్లలో (2021, 2022, 2023) ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ, పారామెడికల్, ఇంటర్మీడియట్ వొకేషనల్ కోర్సులు పూర్తి చేసిన జిల్లాకు చెందిన విద్యార్థుల నుంచి అప్రెంటిస్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో కాక మాధవరావు తెలిపారు. ఈ నెల 30లోగా పూర్తి చేసిన దరఖాస్తులతోపాటు ఆధార్‌కార్డు, అర్హత పత్రాల రెండు సెట్ల జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను హనుమకొండలోని తన కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గీసుగొండ, డిసెంబర్ 13 : చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన వసంతపురంలో జరిగింది. సీఐ రామకృష్ణ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఊరుగొండ బాబురావు(67) రెండు రోజుల క్రితం మద్యం మత్తులో పురుగుల మందు తాగి వాంతులు చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఎంజీఎం దవాఖానకు తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతు బుధవారం సాయంత్రం మృతి చెందాడు.

### కాశీవిశ్వేశ్వర ఆలయంలో కుంకుమ పూజ

కాశీబుగ్గ, డిసెంబర్ 13: వరంగల్ కాశీబుగ్గ ప్రాంతంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో బుధవారం కుంకుమ పూజ నిర్వహించారు. మహిళలు ఉదయం అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, అభిషేకం, మధ్యాహ్నం చండీహోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఒరుగంటి కొమురయ్య, బొడకుంట్ల వైకుంఠం, బొమ్మగాని కృష్ణమూర్తి, బండారి భాస్కర్, నాగమల్ల ఓంకారేశ్వర్, జంగం రాజు, ఉమాశంకర్ పాల్గొన్నారు.


కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు